క్లుప్తంగా

గవర్నర్‌ను కలిసిన సుధాకర్ రెడ్డి



గవర్నర్‌తో కరచాలనం చేస్తున్న సుధాకర్‌రెడ్డి

కదిరి: గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను బుధవారం కదిరికి చెందిన ఏపీపీఎస్సీ సభ్యులు డాక్టర్ జీవీ సుధాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీపీఎస్సీ 2023 ఏడాదికి సంబంధించిన వార్షిక నివేదికను గవర్నర్‌కు అందజేసినట్లు డాక్టర్ జీవీ సుధాకర్ రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ ఆదాయం పెంచుదాం



కండక్టర్‌ను అభినందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం 'డిపోకు ఆదాయాన్ని పెంచే కమిటీ'తో డీఎం మైనోద్దీన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈడీ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్ కడపల నారాయణరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం హరిమోహన్, హరిత, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

తనకల్లు: మండల పరిధిలోని బండకాడపల్లి వద్ద కోడి పందెం ఆడుతున్న ఏడుగురిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. గ్రామ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి రూ.7,330 నగదుతో పాటు 8 ద్విచక్ర వాహనాలను, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు.

దేవాలయాల నిర్మాణానికి విరాళం

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలో పలు దేవాలయాల నిర్మాణానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విరాళం అందించారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 12వ వార్డులో గుర్రప్పస్వామి ఆలయం నిర్మాణానికి రూ.50 వేలు, 24వ వార్డులో ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయ నిర్మాణానికి రూ.50వేలు విరాళాలు అందించి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

మద్దెలచెరువు సూరికి నివాళి



సూరి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న తోపుదుర్తి చందు, గంగుల భానుమతి

కనగానపల్లి: మద్దెలచెరువు సూరి అలియాస్ గంగుల సూర్యనారాయణరెడ్డికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో సూరి భార్య గంగుల భానుమతి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సూరి వర్ధంతి నిర్వహించారు. చుట్టు పక్కల మండలాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులు సూరి ఘాట్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాగముని, రమణారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

ధర్మవరం రూరల్: సావిత్రి భాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం ఏపీటీఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. శాంతినగర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు రాధారాణి, భారతి, శిరీషా, కవిత, ప్రణీత, లావణ్య, షజిదాను సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షులు సానే రవీంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు సంజీవయ్య, ప్రధాన కార్యదర్శి జగదీష్, జిల్లా కౌన్సిలర్లు అమానుల్లా, కృష్ణవేణి, రవిశేఖర్, వినోద్, అంజి, రమణ, మోహన్ తదితరులున్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్‌రెడ్డి మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. భాగ్యలక్ష్మీ, సుభాషిణి, నిర్మల, మరియమ్మ, వింధ్యారాణి, చంద్రకళ, గాయత్రీ, గంగాధర్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, అనిల్‌నాయక్ పాల్గొన్నారు.

కొత్తచెరువులో..

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువులోని విజయనగర కాలనీలో సీతారాముల దేవాలయాల అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయ్ పూలే 193వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో రామాంజనేయులు, చెన్నరాయుడు, ప్రభాకర్, గోపి, అంజనేయులు, మునిలక్ష్మి, శ్రావణి, నాగరాజు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



బైకు ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని ఆరా తీస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపు

ధర్మవరం రూరల్: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా వుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రేగాటిపల్లి, ముచ్చురామి, సీతారాంపల్లిలో ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ రేగాటిపల్లి సురేష్ రెడ్డితో కలిసి పథకాల అమలుపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయంతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా సామాజికంగా గుర్తింపు లభించిందన్నారు. టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాత్రమే పొందారని విమర్శించారు.

జగనన్న పాలనతో గ్రామ స్వరాజ్యం

మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం జగనన్న పాలనలో సాకారమవుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి తెలిపారు. రేగాటిపల్లి పంచాయతీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు రూ. 91 లక్షలు, అలాగే గ్రామ సచివాలయ నిర్మాణానికి రూ. 43.60 లక్షలు, రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి రూ. 23 లక్షలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ. 10 లక్షలు, శానిటరి కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.3 లక్షలు, మనబడి నాడు నేడు ఫేజ్–2 నిర్మాణానికి రూ. 24 లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రూ. 12 లక్షలు, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ. 4.20 లక్షలు, తాగునీటి బోర్లు, పాత బోర్లు రిపేరి తదితర వాటి కోసం రూ.10.20 లక్షలు వెచ్చించామన్నారు. మొత్తం రూ. 2.43 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదే విధంగా రూ. 43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యోగీశ్వరి దేవి, వైస్ ఎంపీపీ పాటిల్ చెన్నక్రిష్ణారెడ్డి, సీనియర్ నాయకులు గంగిరెడ్డి, మండల కన్వీనర్ రామయ్య, మండల సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ రవీంద్రారెడ్డి, నాయకులు గొట్లూరు సంగాలప్ప, మాజీ ఎంపీటీసీ నారపరెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, విశ్వనాథరెడ్డి, అశ్వర్థరెడ్డి, రాజారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, పోతుకుంట రాజు, వెంకటేష్, ప్రభాకర్, జయరాం, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైకు ర్యాలీతో ఫుల్ జోష్

తమ గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. రేగాటిపల్లి సర్పంచ్ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో 400కు పైగా బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బుల్లెట్ నడుపుతూ వారి ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేశారు.

బాధితులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణంలోని కదిరి రైల్వే గేట్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా రైల్వే ఉపరితల వంతెనను నిర్మించనున్నారు. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన 26 మందికి బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

- బత్తలపల్లి మండల కేంద్రానికి చెందిన 48 మంది లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఇళ్ల పట్టాలను స్థానిక ఎమ్మెల్యే నివాసంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో బత్తలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుతో ప్రతిపక్షాల వెన్నులో వణుకు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల హామీలను వంద శాతం అమలు చేస్తుండడంతో ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుడుతోందని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో బుధవారం పుట్టపర్తి రూరల్ మండల పింఛన్ లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పింఛన్ మొత్తం పంపిణీ చేశారు. ఇప్పటి వరకూ ఇస్తున్న రూ.2750కు రూ.250 కలిపి మొత్తం రూ.3 వేలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి మండలంలో సుమారు 4,600 మంది పింఛన్‌దారులు ఉన్నారన్నారు. వీరందరికీ రూ.3 వేలు అందుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వస్తూనే ఎగ్గొట్టి ప్రజలను గత ప్రభుత్వాలు మోసగించాయన్నారు. భవిష్యత్తులో సంక్షేమ పథకాలు అందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు తమ ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి రుణం తీర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మండల కన్వీనర్ నరసారెడ్డి, సచివాలయ కన్వీనర్ మల్లిఖార్జున, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, సర్పంచులు లక్ష్మీనరసమ్మ, లలితమ్మ, వెంకటేషు, కుల్లాయిరెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మాధవప్ప, అగ్రి బోర్డు చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీల, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ అశోక్‌కుమార్ రెడ్డి, నాయకులు బాలు ఆదెప్ప, వెంకటరెడ్డి, రమణారెడ్డి, పవన్ తదితరులు న్నారు.

ఘనంగా పెన్షన్ కానుక సంబరాలు

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి హనుమాన్ సర్కిల్ వద్ద 'వైఎస్సార్ పెన్షన్ కానుక' సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీలో 20 వార్డులకు సంబంధించి నాలుగు వేల మందికి పైగా పింఛన్‌దారులకు పెరిగిన పింఛన్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అర్హులందరినీ సంక్షేమ ఫలాలతో ఆదరిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో రూ. వెయ్యి పెన్షన్ ఇచ్చి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నాడని గుర్తు చేశారు. లబ్ధిదారులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

సాయి భక్తులకు కార్మికులు సహకరించాలి

సాయి భక్తులకు పారిశుధ్య కార్మికులు సహకరించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులతో బుధవారం ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు దేవుళ్లతో సమానమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పని చేస్తున్నారన్నారు. సత్యసాయి నడయాడిన ప్రాంతంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పుట్టపర్తికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా పారిశుధ్య పనుల్లో పాల్గొనాలని కోరారు. కార్మికుల ఆర్థిక, సాంకేతిక పర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డిని ఆదేశించారు.



మేము సైతం జగన్ కోసం అంటూ నినాదాలు చేస్తున్న లబ్ధిదారులు

వైఎస్సార్‌సీపీలో ముస్లింలకు పెద్దపీట



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్



టీడీపీ నాయకులకు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మక్బూల్ అహ్మద్

- కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్

కదిరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు పెద్దపీట వేస్తోందని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్.మక్బూల్ అహ్మద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తన స్వగృహంలో పార్టీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించడంతో ఎంతోమంది డాక్టర్లు, ఇంజినీర్లు, ఇంకా ఎన్నో ఉన్నత ఉద్యోగాలు దక్కించుకున్నారని గుర్తు చేశారు. ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సైతం ముస్లింల పక్షపాతిగా ముద్ర వేసుకున్నారని తెలిపారు. 2019 ఎన్నికల్లో ముస్లింలకు 5 చోట్ల ఎమ్మెల్యే టికెట్లు ఇస్తే నలుగురు గెలిచారని, వారిలో ఒకరికి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ముస్లింలంతా ఆయనకు కృతజ్ఞతగా ఉంటారని మక్బూల్ తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో మూడోసారి కదిరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి, హ్యాట్రిక్ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్త లందరూ కలిసి కట్టుగా పని చేస్తామని ఆ పార్టీ సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కదిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని మరోసారి నిరూపిద్దామన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.ఎస్.మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన తన స్వగృహంలో పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

కదిరి టౌన్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బి.ఎస్ మగ్బూల్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల మోములో చిరునవ్వే లక్ష్యం



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: అవ్వాతాతల మోములో చిరునవ్వు చూడాలనేదే జగనన్న లక్ష్యం అని ఎమ్మెల్యే డా. పీవీ సిద్దారెడ్డి అన్నారు. స్థానిక సచివాలయం–1 ఆవరణలో బుధవారం సర్పంచ్ శ్రీలత, ఉప సర్పంచ్ డీకే బాబు అధ్యక్షతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి చేతుల మీదుగా పెరిగిన పింఛన్ డబ్బు రూ. 3 వేలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచి అందజేసిన ఘనత జననేత జగన్‌కే దక్కుతుందన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమం ఆగకుండా రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, మండల కన్వీనర్ పయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫినాయక్, మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ టోపీరమణ, ఈఓపీఆర్డీ శకుంతల, సర్పంచ్‌లు శ్రీరామ్‌రెడ్డి, పెద్దినాయుడు, దివాన్‌వలి, రాజగోపాల్‌రెడ్డి, మౌలా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభం

ఎన్పీకుంట: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తూ వారి పక్షాన నిలబడటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెలిచలమల గ్రామంలో రూ.20.80 లక్షలతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ (భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం) భవనాన్ని బుధవారం నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతోనే గ్రామ సచివాలయల పరిధిలో డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ (భారత్ నిర్మాణ్ సేవా కేంద్రం) లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవన నిర్మాణ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తీ చేసి అప్పగించిన నిర్మాణ సహాయకులు వేణుగోపాల్‌యాదవ్‌ను, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సమరసింహారెడ్డిని ఎమ్మెల్యే దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటెరాము, మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, ఎంపీడీఓ ఆదినారాయణ, ఏపీఓ చంద్రశేఖర్, వైద్యాధికారి డాక్టర్ ఆనంద్ వర్ధన్, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

గాండ్లపెంట: మండల పరిధిలోని మల్లమీద పల్లికి చెందిన విశ్రాంత వీఆర్‌ఓ రామచంద్రారెడ్డి (85) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గ్రామానికి విచ్చేసి వీఆర్‌ఓ మృతదేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

ధర్మవరం అర్బన్: ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సెల్వి సాల్మన్‌లు తెలిపారు. పట్టణంలోని కొత్తపేట అర్బన్ హెల్త్‌సెంటర్ పరిధిలోని గూడ్స్‌షెడ్‌కొట్టాల 1వవార్డు సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రతిఒక్కరికి వైద్య పరీక్షలు చేసి జబ్బులుంటే వైద్యం చేయించి ఆరోగ్యంగా ఉంచేందుకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 433 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని, వారందరికి ఉచితంగా మందులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కేతాలోకేష్, వార్డు ఇన్‌చార్జ్ చెలిమి పెద్దన్న, మున్సిపల్ ఆర్ఓ ఆనంద్, టీపీఆర్ఓ సుబ్బరాయుడు, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్, వైద్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లు విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం రూరల్: పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు వనం శ్రీనివాసులు (47) బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీనివాసులు కూలి మగ్గం నేసుకుంటూ కుటుంబ పోషణ చేస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం సుమారు రూ.5లక్షల దాకా అప్పులు చేశాడు. ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుండేవాడు. ఈ క్రమంలోనే మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య భాగ్యమ్మ మూడేళ్ల క్రితమే విడాకులు ఇచ్చింది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ఓటింగ్‌పై అవగాహన పెంచుకోండి

పుట్టపర్తి అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎలక్ట్రానింగ్ ఓటింగ్, ఓటింగ్ మిషన్‌పై అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై ఇప్పటికే కొత్తచెరువు, నల్లమాడ మండల కేంద్రాల్లో అవగాహన కల్పించామన్నారు. బుక్కపట్నం, ఓడీసీలో అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

ధర్మవరం అర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని ఆర్డీఓ రమేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటు హక్కు పొందడం, మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర వాటి విషయాలలో బీఎల్ఓలతో రాజకీయ నాయకులు పారదర్శకతతో సహకరించాలని సూచించారు. తహసీల్దార్ యుగేశ్వరిదేవి, సిబ్బంది రాజ్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని ఆర్డీఓ రమేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గత 10 రోజులుగా ఈవీఎంలో ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. బుధవారం ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల అధికారి, సిబ్బంది ద్వారా ఆర్డీఓ కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికీ ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే ఆడుదాం–ఆంధ్రా

బత్తలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ అన్నారు. బత్తలపల్లి ఆర్డీటీ క్రీడా మైదానంలో బుధవారం 'ఆడుదాం –ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు.

ద్విచక్రవాహనం అపహరణ

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం మంగళవారం రాత్రి చోరీకి గురైంది. డిపోలో డ్రైవర్‌గా పనిచేసే అనిల్ సిన్హా తన ఏపీ02ఏబీ3809 నంబరు మోటారు సైకిల్‌ను గ్యారేజీ ముందు పార్కింగ్ చేసి విధులకు వెళ్లారు. బుధవారం వచ్చి చూస్తే కనపడలేదు. గతంలో ఇదే ప్రాంతంలో ఆర్టీసీ ఉద్యోగులు పార్కింగ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. పట్టణ పోలీసులు ఈ ప్రాంతంలో నిఘా ఉంచాలని ఉద్యోగులు కోరుతున్నారు.

గుండెపోటుతో రైతు మృతి

కదిరి టౌన్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయ సమీపంలో కదిరి మండలం వై.కొత్తపల్లికి చెందిన నారాయణప్ప (68) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. రైతు నారాయణప్ప ఇటీవల తన పొలంలో బోరు వేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం కదిరికి బుధవారం వచ్చారు. ఆర్‌అండ్‌బీ కార్యాలయ సమీపంలోని సచివాలయం వద్ద స్పృహ తప్పి పడి మృతి చెందినట్లు నారాయణ కుమారుడు చెన్నక్రిష్ణ తెలిపారు. కుటుంబ పెద్ద దిక్కు మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించండి

తలుపుల: గ్రామ సచివాలయాల పరిధిలో ఆదాయ వనరులపై దృష్టి సారించాలని డీఎల్‌పీఓ డి. అంజినప్ప గ్రామ కార్యదర్శులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ పన్నులు, 2024–25 సంబంధించిన జీపీడీపీ షెడ్యూల్, గ్రామసభల నిర్వహణ, క్లాప్ మిత్ర జీతాలు, రోజువారి అటెండెన్స్, జీపీపీ పాయింట్స్ గుర్తింపు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శ్రమదానం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి గుడి ఆవరణంలో బుధవారం ఉపాధ్యాయులు శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ రమణప్ప మాట్లాడుతూ భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా శ్రమదానం చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

తాడిమర్రి: మండలంలోని వైద్య, ఆరోగ్య ఉపకేంద్రాల్లో వైద్య సిబ్బంది బుధవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మండలంలోని తాడిమర్రి, కునుకుంట్ల, దాడితోట, పెద్దకోట్ల, చిల్లవారిపల్లి, చిన్నచిగుళ్లరేవు, ఎం.అగ్రహారం, నార్శింపల్లి, పిన్నదరి తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది చిన్నారులకు బీసీజీ, ఎంఎమ్మార్, డీపీటీ, నిమ్మోనియా, పెంటా, హెపటైటీస్ బీ తదితర టీకాలను వేశారు. ఏఎన్ఎంలు కోమలి, కృష్ణమ్మ, లక్ష్మీకాంతమ్మ, సుగుణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల సేకరణపై సర్వే

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో విస్తరించిన అడవుల్లో లభించే కలపేతర అటవీ ఉత్పత్తుల సేకరణపై బెంగుళూరుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్ సైన్స్ టెక్నాలజీకి చెందిన విద్యార్థులు బుధవారం సర్వే నిర్వహించారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో మమత, రేఖ, శ్వేత, టీఆర్ నాగరాజు తదితర విద్యార్థులు దాడితోట, చిల్లవారిపల్లి, రామాపురం, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో వనసంరక్షణ సమితి మండల అధ్యక్షులు శివారెడ్డి తదితరులున్నారు.